సాక్షి
నంద్యాల
గురువారం । 2 । మే । 2024



నిబంధనలు పాటించాలి
ఆలూరు: ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులను సాధారణ ఎన్నికల పరిశీలకులు మీర్ తారిక్ అలీ ఆదేశించారు. ఆలూరులో స్ట్రాంగ్‌రూమ్‌ను ఆయన పరిశీలించారు.



పక్షుల కోసం..
శ్రీశైలంటెంపుల్: వేసవి తీవ్రత దృష్ట్యా పక్షులకు నీరు, ధాన్యపు గింజలను అందించేందుకు క్షేత్రంలోని ఉద్యానవనాల్లో మట్టి మూకుళ్లను ఏర్పాటు చేసినట్లు ఈఓ డి.పెద్దిరాజు తెలిపారు.



మల్లన్నకు నృత్యార్చన
శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై బుధవారం మంచిర్యాలకు చెందిన కామేశ్వర నాట్య కదంబ అకాడమీ ఆఫ్ కూచిపూడి వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

గిరా గిరా తిరుగుతోంది ఫ్యాను!

జోరుమీదున్న వైఎస్సార్‌సీపీ

- 2019 సార్వత్రిక ఎన్నికల్లో క్లీన్‌స్వీప్
- 51.5శాతం ఓట్లతో తిరుగులేని ఆధిక్యం
- రెండేళ్ల తర్వాత జరిగిన ప్రాదేశిక ఎన్నికల్లో 64.47 శాతం ఓటు బ్యాంకు
- సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఓటింగ్ శాతం 37.77.. ప్రాదేశిక ఎన్నికల్లో 22.87 శాతానికే పరిమితం
- ఐదేళ్ల సంక్షేమంతో వైఎస్సార్‌సీపీకి పెరిగిన ఆదరణ
- గత ఫలితాలే పునరావృతమవుతాయనే ధీమా

'మీ కష్టాలను నేను చూశాను. నేను విన్నాను.. నేను ఉన్నాను' అని ప్రతిపక్షనేతగా పాదయాత్రలో ప్రజలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లా మొత్తం జగన్‌ను విశ్వసించి సార్వత్రిక ఎన్నికల్లో పట్టం కట్టారు. ఆపై రెండేళ్ల తర్వాత జరిగిన ప్రాదేశిక ఎన్నికల్లో రెండేళ్ల పాలనపై ప్రతీ పల్లె, మండలం, పట్టణం సానుకూలత వ్యక్తం చేసింది. సార్వత్రికం కంటే మరింత మెరుగైన మెజార్టీ కట్టబెట్టారు. పదిరోజుల్లో మళ్లీ సార్వత్రిక పోరు జరుగనుంది. ఐదేళ్ల పాలనలో చేసిన మంచితో 2019 ఫలితాలు పునరావృతమవుతాయని వైఎస్సార్‌సీపీ భావిస్తోంది. ఇటీవల జరిగిన బస్సుయాత్ర విజయవంతం కావడం, మేనిఫెస్టోను ప్రజలు విశ్వసించడంతో ఆ పార్టీ ధీమాగా ఉంది.

– సాక్షి ప్రతినిధి, కర్నూలు



కొత్తపల్లి మండలం ఎర్రమఠంలో ప్రసంగిస్తున్న శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి దారా సుధీర్

రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోలిస్తే ఉమ్మడి కర్నూలు జిల్లా రాజకీయం భిన్నమైంది. తెలంగాణకు సరిహద్దు జిల్లా కావడం.. రెండూ తెలుగు రాష్ట్రాలే కావడంతో పాలనపై రాజకీయనేతలతో పాటు ప్రజలు, రాజకీయ విశ్లేషకులు పోల్చి చూడటం పరిపాటి. ఇలాంటి జిల్లాలోని ప్రజలు ఇచ్చే తీర్పు సుస్పష్టంగా ఉంటుంది. పాలన, విధానపరమైన నిర్ణయాలపై ఇక్కడి ప్రజల్లో చైతన్యం ఎక్కువ. తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలను ఇక్కడి వైఎస్సార్‌సీపీ పాలనతో పోల్చుతున్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చిస్తున్నారు. మరో పదిరోజుల్లో సార్వత్రిక ఎన్నికలు ఉండటంతో ప్రతీ పల్లె, పట్టణంలో ఇదే చర్చ నడుస్తోంది.

2019 సార్వత్రిక ఎన్నికల్లో క్లీన్‌స్వీప్

గత సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అఖండ మెజార్టీని కట్టబెట్టారు. ఇద్దరు ఎంపీలతో పాటు 14మంది ఎమ్మెల్యేలను గెలిపించారు. ఒకేపార్టీ ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలను పూర్తిగా గెలవడం, ప్రతిపక్షపార్టీ తుడిచిపెట్టుకోవడం కర్నూలు రాజకీయ చరిత్రలో తొలిసారి. ఆ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 51.5శాతం ఓట్లు దక్కాయి. ఒక పార్టీకి ఈ స్థాయిలో ఓట్లు రావడం కూడా అదే ప్రథమం. ఆ తర్వాత రెండేళ్లకు ఎన్నికలు జరిగితే ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉండటమనేది సహజం. అయితే జగన్ ప్రభుత్వానికి ప్రజలు భిన్నమైన తీర్పు ఇచ్చారు. 52 జెడ్పీటీసీలతో పాటు 53 మండల పరిషత్‌లను అధికార పార్టీకి అప్పగించారు. ఇలాంటి ఫలితాలు రావడం కూడా జిల్లా చరిత్రలో తొలిసారి. రెండేళ్లపాలన, సంక్షేమం అద్భుతంగా ఉన్నాయని ప్రజలు తేల్చి చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో 51.5శాతం ఓట్లు ప్రజలు వేస్తే, ప్రాదేశిక ఎన్నికల్లో 64.47శాతం పోలయ్యాయి. అంటే రెండేళ్లలో 12.97శాతం అదనంగా ప్రజలు వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచారు.

మెరుగైన ఫలితాలు వస్తాయనే భావనలో వైఎస్సార్‌సీపీ

2019 ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ ప్రతిపక్ష పాత్ర పోషించింది. ఈ ఐదేళ్లలో రెండేళ్ల కోవిడ్ పరిస్థితుల్లో ఆర్థిక పరిస్థితి కఠినంగా ఉన్నా మేనిఫెస్టో, నిర్దేశించుకున్న అభివృద్ధి విషయంలో ప్రభుత్వం రాజీ పడలేదు. సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లీనిక్‌లతో పల్లె ముఖచిత్రాన్ని మార్చేసింది. వలంటీర్లతో పౌరసేవల్లో సంస్కరణలు తీసుకొచ్చింది. 'ఆత్మగౌరవం' అనే మాటకు విలువను పెంచింది. అలాగే మేనిఫెస్టోను 99శాతం అమలు చేసి 'విశ్వసనీయత'ను చాటింది. దీంతో 'జగన్ ఏదైతే చెబుతాడో అది కచ్చితంగా చేస్తాడనే' భావన ప్రజల్లో వచ్చింది. 'గడప, గడపకూ మన ప్రభుత్వం' పేరుతో ఎమ్మెల్యేలను ప్రతి ఇంటికి పంపి మీకు మంచి జరిగిందా? లేదా? అని ప్రతీ ఇంటి తలుపు తట్టారు. ఈ కార్యక్రమం చేసిన ప్రభుత్వం కూడా దేశంలో వైఎస్సార్‌సీపీ మాత్రమే. దీనికి తోడు 'మంచి చేసి ఉంటేనే తమకు ఓటు వెయ్యాలని' పదేపదే సీఎం జగన్ చెప్పడంతో ఇంత ధైర్యంగా చెప్పిన వ్యక్తి లేరు. మంచి చేసిన వ్యక్తికి అండగా ఉంటే మరింత మేలు జరుగుతుందనే అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉంది. పైగా అన్ని వర్గాలకు పార్టీ న్యాయం చేసింది. ఓ ఎమ్మెల్యే, ఎంపీ సీట్లకు బోయ, ఎమ్మిగనూరు చేనేతకు, కర్నూలు మైనార్టీకి కేటాయించింది. జిల్లా అధ్యక్ష పదవి కురుబలకు అప్పగించింది. దీంతో సామాజిక న్యాయం చేసింది. అంతకు ముందు నామినేటెడ్ పోస్టుల్లో కూడా 50శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చారు. అందులో 50శాతం మహిళలకు కేటాయించారు. ఈ పరిణామాలన్నీ ఏ రాజకీపార్టీ గతంలో చేయలేదు. ఇటీవల నంద్యాల, కర్నూలు జిల్లాల్లో బస్సుయాత్రకు ప్రజలు భారీగా తరలివచ్చి సంఘీభావం ప్రకటించారు. దీంతో ఆ పార్టీ నేతలు రెట్టించిన ఉత్సాహంతో పాల్గొంటున్నారు. తిరిగి 14 అసెంబ్లీ, 2 ఎంపీలతో క్లీన్‌స్వీప్ చేస్తామనే ధీమాలో ఆ పార్టీ ఉంది.

తగిన ఓటు బ్యాంకుతో టీడీపీ బోణీ కొట్టేనా?

2019 సార్వత్రిక ఎన్నికల్లో 37.77శాతం ఓట్లు టీడీపీకి పోలైతే, ప్రాదేశిక ఎన్నికల్లో 22.87శాతానికి తగ్గింది. పైగా ప్రతిపక్షపాత్ర పోషించేందుకు అధికారపార్టీ అవకాశం కూడా ఇవ్వలేదు. ఈ ఐదేళ్లలో టీడీపీ చేపట్టిన పెద్ద నిరసన కార్యక్రమం కూడా ఏదీ లేదు. చివరకు వలంటీర్లకు రూ.10వేల పెంచుతామని చంద్రబాబు చెప్పడం, ఇప్పుడు అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాల పేర్లు మార్చి తాను అమలు చేస్తానని చెప్పడంతో జగన్ పాలన భేష్ అని పరోక్షంగా టీడీపీ అంగీకరించినట్లయింది. పైగా గత ప్రభుత్వంలో రుణమాఫీ, నిరుద్యోగ భృతి, డ్వాక్రా రుణమాఫీ తదితర హామీలలో టీడీపీ విఫలమైంది. దీంతో టీడీపీ మేనిఫెస్టోపై ప్రజల్లో విశ్వసనీయత లేదు. ఈ కారణంగానే మేనిఫెస్టోలో బీజేపీ భాగస్వామి కాలేదు. కూటమిలో భాగస్వామిగా ఉన్న పార్టీనే చంద్రబాబును నమ్మకపోతే ఇక ప్రజలు ఎలా నమ్ముతారనే చర్చ నడుస్తోంది. ఈ ఎన్నికల్లో జగన్, చంద్రబాబు మధ్య 'విశ్వసనీయత' తీవ్ర ప్రభావం చూపనుంది. జిల్లాలో స్థానికంగా కూడా టీడీపీ బలహీనంగా ఉంది. ఒక జెడ్పీటీసీ, మండల పరిషత్ కూడా గెలవలేదు. పైగా 2004 నుంచి ఇప్పటి వరకూ జరిగిన నాలుగు ఎన్నికల్లో టీడీపీ అత్యధికంగా గెలిచిన అసెంబ్లీలు 4 మాత్రమే. దీంతో ఈ ఎన్నికల్లో కనీసం ఒక స్థానంలోనైనా బోణీ కొట్టాలనే భావనలో టీడీపీ ఉంది. కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం లాంటి జాతీయ పార్టీలు కూడా పోటీలో ఉన్నాయి. వీళ్ల కనీసం పోటీ ఇచ్చే పరిస్థితి కూడా లేకపోవడం గమనార్హం.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వివిధ పార్టీలకు వచ్చిన ఓట్లు, వివరాలు(2019)

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	వైఎస్ఆర్‌సీపీకి వచ్చిన ఓట్లు	శాతం	టీడీపీకి వచ్చిన ఓట్లు	శాతం	జనసేనకు వచ్చిన ఓట్లు	శాతం	కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్లు	శాతం
ఆళ్లగడ్డ	185911	105170	56.57	69718	37.50	2057	1.10	2624	1.41
నందికొట్కూరు	171747	102005	59.4	61746	35.96	3290	1.9	1660	0.97
శ్రీశైలం	152529	91603	60.05	53176	34.87	1967	1.29	1181	0.78
కర్నూలు	154063	71954	46.70	66064	42.88	3763 (సీపీఎం)	2.44	3387	2.19
పత్తికొండ	173428	100414	57.9	58558	33.76	2303	1.33	2380	1.37
పాణ్యం	197078	121636	61.71	77681	39.41	5083	2.56	2458	1.24
నంద్యాల	197078	107003	54.3	73576	37.33	5995	3.04	1106	0.56
బనగానిపల్లె	187744	99240	52.9	85693	45.65	1504	0.80	2163	1.15
డోన్	173403	100402	57.9	65007	37.48	2537 (సీపీఐ)	1.46	1567	0.9
కోడుమూరు	171843	94754	55.14	58825	34.23	4283 (బీఎస్పీ)	2.49	3614	2.10
ఎమ్మిగనూరు	197893	95996	48.5	70160	35.45	2935	1.48	2680	1.35
మంత్రాలయం	158916	86794	54.6	62873	39.56	1394	0.87	1912	1.20
ఆదోని	156837	73575	46.9	61409	39.15	11836	7.54	2149	1.37
ఆలూరు	188196	106940	56.82	66912	35.55	3528	1.87	2769	1.47

సార్.. పింఛన్ పడిందా!

- బ్యాంక్ అకౌంట్‌లో పింఛన్ పడిందో.. లేదోనని లబ్ధిదారుల ఆందోళన
- సమాచారం కోసం సచివాలయానికి అవ్వాతాతలు
- డోర్ టూ డోర్ పంపిణీలో 64.73 శాతం పూర్తి



కొలిమిగుండ్ల మండలం గొర్విమానుపల్లెలో సచివాలయం వద్ద వేచి ఉన్న పింఛన్‌దారులు

నంద్యాల(న్యూటౌన్): దాదాపు ఐదేళ్లు ఠంఛన్‌గా పింఛన్ అందుకున్న లబ్ధిదారులు టీడీపీ నేతల కుట్రతో అవస్థలు పడుతున్నారు. ప్రతి నెల 1వ తేదీన తెల్లవారక ముందే వలంటీర్లు పింఛన్ అందజేయగా.. ప్రస్తుతం రెండు నెలలుగా పింఛన్ కోసం నిరీక్షించాల్సి వస్తోంది. ఆదివారమైనా, సెలవు రోజు అయినా.. పండుగ అయినా.. ఒకటో తేదీ పింఛన్ అందేది. సార్వత్రిక ఎన్నికల వేళ వలంటీర్ల చేత పింఛన్ల పంపిణీని టీడీపీ అండ్ కో ఎన్నికల సంఘం ద్వారా అడ్డుకుంది. దీంతో ఏప్రిల్ నెలలో సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ చేయగా, మే నెల బ్యాంక్ అకౌంట్‌లు ఉన్న లబ్ధిదారులకు బ్యాంక్‌లో జమ చేయగా, దీర్ఘకాలిక రోగులు, దివ్యాంగులు, మంచానికి పరిమితమైన వృద్ధులకు డోర్ టుడోర్ పంపిణీ చేపట్టారు. మే 1వ తేదీ మేడే కావడంతో బ్యాంక్‌లకు సెలవు. దీంతో ఎంత మంది అకౌంట్లలో పింఛన్ సొమ్ము జమ అయ్యిందో తెలియదు. నంద్యాల జిల్లాలో 2,22,405 పింఛన్లు ఉండగా డోర్‌టుడోర్ 54,244 మందికి ఇవ్వాలని, 1,68,096 మంది లబ్ధిదారులకు బ్యాంక్ అకౌంట్లలో జమ చేయాలని అధికారులు నిర్ణయించారు. కాగా బుధవారం డోర్ టు డోర్ ద్వారా 33,095 మందికి (64.73 శాతం) సచివాలయ సిబ్బంది పంపిణీ చేశారు.

నేటి నుంచి బ్యాంకులకు పోటెత్తనున్న పింఛన్‌దారులు

మే నెలలో కూడా చంద్రబాబు కుట్రల కారణంగా జిల్లాలో 1,71,215 మంది పింఛన్‌దారులు సుదూర ప్రాంతాల్లోని బ్యాంకుల మెట్లు ఎక్కాల్సి వచ్చింది. పింఛన్‌దారుల బ్యాంకు ఖాతాలకు డీబీటీ ద్వారా బ్యాంకు ఖాతాలకు బుధవారం ఉదయం నుంచే నగదు బదిలీ చేయడం మొదలైంది. గురువారం మధ్యాహ్నానికి 100 శాతం పింఛన్‌దారుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ఎంతమంది బ్యాంకు ఖాతాలకు నగదు జమ అయిందనే సమాచారం జిల్లా కేంద్రానికి రాలేదు. బుధవారం మేడే సెలవు కావడంతో బ్యాంకులు పనిచేయలేదు. గురువారం నుంచి అవ్వతాతలు, ఇతర పింఛన్‌దారులు బ్యాంకులకు పోటెత్తనున్నారు. పచ్చ గ్యాంగ్ కుట్రల కారణంగా ముదిమి వయస్సులో బ్యాంకు మెట్లు ఎక్కాల్సి రావడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. బ్యాంకులకు వెళ్లి నగదు తెచ్చుకోవాలంటే తల ప్రాణం తోకకు రావాల్సిందే. ఎందుకంటే ప్రతి మండలంలో గరిష్టంగా నాలుగైదు వరకే బ్యాంకులు ఉన్నాయి. మండలంలో గ్రామాలు 15 నుంచి 50 వరకు ఉన్నాయి. పింఛన్‌దారుల తాకిడితో నేటి నుంచి బ్యాంకులు కిటకిటలాడే అవకాశం ఏర్పడింది. పింఛన్‌దారులు బ్యాంకులకు వచ్చే అవకాశం ఉండటం వల్ల బ్యాంకుల్లో తగిన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఎంతో ఉంది. వీరిలో అవ్వతాతలే ఎక్కువగా ఉన్నారు.

ఇవేమి కష్టాలు

పగిద్యాల: డోర్ టు డోర్ పింఛన్ల పంపిణీలో బయోమెట్రిక్ సిస్టమ్‌లో ఆధార్‌కార్డు ఎంటర్ చేసి అందులో లబ్ధిదారుని పేరు డిస్‌ప్లే అయితేనే నగదును వృద్ధులు తీసుకుంటున్నారు. పేరు డిస్ ప్లే కాని వారికి బ్యాంక్‌ల వద్దకు వెళ్లి తెచ్చుకోవాలని చెబుతుండడంతో పింఛన్ దారులు మండిపడుతున్నారు. ఒక్కో నెల ఒక్కో విధానం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

33 గ్రామాలు.. 4 బ్యాంకులు

కొలిమిగుండ్ల: మే నెల పింఛన్ సొమ్ము తీసుకునేందుకు బ్యాంక్ మెట్లు ఎక్కాల్సి రావడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 33 గ్రామాలు ఉండగా కేవలం నాలుగు బ్యాంకులు మాత్రమే ఉన్నాయి. కొలిమిగుండ్ల ఎస్‌బీఐ, ఏపీజీబీ బ్యాంక్‌లు, పెట్నికోట, అంకిరెడ్డిపల్లె ఏపీజీబీ బ్యాంక్‌లు ఉన్నాయి. పింఛన్ సొమ్ము విత్‌డ్రా చేసుకునేందుకు దాదాపు 20 కి.మీ దూరంలోని బ్యాంక్‌లకు వెళాల్సి వస్తుంది.


ఏం పాపం చేశామని



సీఎం జగన్ పింఛన్ల నుంచి పథకాల వరకు మాకు శ్రమ లేకుండా వలంటీర్ల ద్వారా అందిస్తున్నారు. పింఛన్ మొత్తాన్ని పెంచుతూ అండగా నిలిచారు. వలంటరీ వ్యవస్థపై బురద చల్లడం సమంజసం కాదు. ఏం పాపం చేశామని ఈ వయస్సులో మాకు ఈ శిక్ష? మేము సంతోషంగా ఉండటం చంద్రబాబుకు ఇష్టం లేదా, మా లాంటి వారి ఉసురు తప్పక తగులుతుంది.

– ఫాతిమా, నంద్యాల

మా శాపం తగలక పోదు



నా వయస్సు 80 ఏళ్లు. మనిషి తోడున్నా నడవలేని పరిస్థితి. రెండు నెలలుగా పింఛన్ కోసం అవస్థలు పడుతున్నాం. ఐదేళ్లు వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్ పంచేవారు. ఈనెల కార్యాలయానికి వస్తే మళ్లీ బ్యాంక్‌కు వెళ్లాలని చెబుతున్నారు. చంద్రబాబునాయుడుకు జాలీ, దయ, మానవత్వం లేదు. మా శాపం తగలక పోదు.

– పుల్లయ్య, కొత్త ముచ్చుమర్రి

ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యం

- నంద్యాల జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి



ఆత్మకూరులో కవాతు నిర్వహిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి, పోలీసులు

ఆత్మకూరు/వెలుగోడు: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే తమ లక్ష్యమని నంద్యాల జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించేలా ధైర్యం కల్పించేందుకు కేంద్ర సాయుధ బలగాలు, పోలీసుల కలిసి నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, ఆత్మకూరు డీఎస్పీ ఏ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం ఆత్మకూరు, వెలుగోడులో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించే విషయంలో ప్రజలు అపోహలకు గురి కావద్దన్నారు. ప్రతి ఒక్కరూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ పాటించాలి. కుల, మత, వర్గాల మధ్య విద్వేషాలకు విభేదాలకు దారి తీసే విధంగా ప్రసంగాలు చేయరాదని, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టరాదన్నారు. తప్పుడు సమాచారాన్ని లేదా తెలియని సమాచారాన్ని సోషల్ మీడియా ద్వారా వ్యాప్తి చేయరాదన్నారు. వివాదాస్పద పోస్టింగులు వాట్సాప్‌లో పెట్టినట్టయితే అడ్మిన్లే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు నాగభూషణం, లక్ష్మీనారాయణ, ఆత్మకూరు, పాములపాడు, వెలుగోడు, కొత్తపల్లి ఎస్ఐలు నారాయణరెడ్డి, ఆశోక్, భూపాలుడు, హరిప్రసాద్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఇంటర్ సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఎస్పీజీ కళాశాల, బాలికల జూనియర్ కళాశాల, ఆత్మకూరు బాలికల కళాశాలలో బుధవారం ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించినట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి సునీత తెలిపారు. ఈ పరీక్షలకు 15 మందికి గాను 12 మంది హాజరు కాగా ముగ్గురు గైర్హాజరైనట్లు ఆమె తెలిపారు. 4వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతయన్నారు.

15 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా క్రీడా సంస్థ ఆధ్వర్యంలో పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో వేసవి శిక్షణ శిబిరాలు ఈనెల 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించాల్సి ఉండగా ఎన్నికల సందర్భంగా తేదీని మార్పు చేశారన్నారు. ఈ మార్పును గమనించి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హజ్ యాత్రికులు ఆరోగ్య సూత్రాలు పాటించాలి



వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకట రమణ

నంద్యాల టౌన్: హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలు తమ వ్యక్తిగత ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ తగిన ఆరోగ్య సూత్రాలు పాటించాలని జిల్లా వైద్యారోగ్యాధికారి డాక్టర్ వెంకట రమణ అన్నారు. సోమవారం సర్వజన అనుపత్రి ప్రాంగణంలోని డైక్ సెంటర్‌లో హజ్ యాత్రికులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని సందర్శించిన మాట్లాడుతూ యాత్రికులు ప్రయాణ, యాత్ర సమయంలో సురక్షితమైన నీటిని మాత్రమే తాగాలని, తీసుకునే ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ తప్పనిసరన్నారు. చిన్న పాటి అనారోగ్య లక్షణాలను అశ్రద్ధ చేయకుండా జాగ్రత్త వహించి వైద్యులను సంప్రదించి వారి సూచనలు పాటించాలన్నారు. వైద్య శిబిరంలో పాల్గొన్న 28 మందికి పోలియో, ఇన్‌ఫ్లూఎంజా తదితర వ్యాక్సిన్లు వేసి, వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించామన్నారు. ఈ వైద్య శిబిరంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ప్రసన్నలక్ష్మి, డాక్టర్ జగదీష్ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఉగ్ర భానుడు



కర్నూలు(అగ్రికల్చర్): ఉష్ణోగ్రతలు ఇప్పట్లో తగ్గే పరిస్థితి కనిపించడం లేదు. ఎండలు, వడగాడ్పుల తీవ్రతకు ప్రజలు అల్లాడిపోతున్నారు. బుధవారం 44 నుంచి దాదాపు 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కర్నూలు జిల్లాతో పోలిస్తే నంద్యాల జిల్లాలో భానుడి భగభగలు ఎక్కువగా ఉన్నాయి. డోన్, బనగానపల్లిల్లో 45.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మహానంది, రుద్రవరంలో 45.2, పాములపాడులో 45 డిగ్రీల ప్రకారం నమోదయ్యాయి. నందికొట్కూరులో 44.9, కోసిగి, సంజామలలో 44.8, పాణ్యంలో 44.7, కర్నూలు 44.5, దొర్నిపాడు, కోవెలకుంట్లలో 44.3, కోడుమూరు, బండిఆత్మకూరు, కల్లూరులో 44 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న మూడు, నాలుగు రోజుల్లో ఎండలు, వడగాడ్పుల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ అధికారులు తెలిపారు.

శ్రీశైలంలో ప్లాస్టిక్ వినియోగం నిషేధం

శ్రీశైలంటెంపుల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా శ్రీశైలక్షేత్ర పరిధిలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించామని దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ శ్రీశైల మహాక్షేత్రాన్ని ప్లాస్టిక్ రహిత క్షేత్రంగా తీర్చిదిద్దేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. దేవస్థానం చెక్‌పోస్టు వద్ద ప్లాస్టిక్ బాటిళ్లను క్షేత్ర పరిధిలోకి రాకుండా తనిఖీలు చేపడుతామన్నారు. స్థానికులు, స్థానిక వ్యాపారులు హోటళ్ల నిర్వాహకులు మొదలైన వారంతా ప్లాస్టిక్ కవర్ల వినియోగానికి బదులు కాగితపు కవర్లు, గుడ్డ సంచులు, జ్యూట్ బ్యాగులు వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ మంచినీటి సీసాలకు బదులుగా మట్టి, స్టీల్, రాగి సీసాలను వినియోగించుకోవాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం పలుచోట్ల ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసిందని అన్నారు. స్థానికులు, వ్యాపారులు, హోటల్ నిర్వాహకులు, సత్రాల నిర్వాహకులు ప్లాస్టిక్ నిషేధంపై దేవస్థానానికి సహకరించాలన్నారు.

క్లుప్తంగా

వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులకు ఆఫర్

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులకు యూనియన్ బ్యాంక్ ఆఫర్ ప్రకటించింది. ఈ శాఖ ఉద్యోగులు తమ బ్యాంకులో ఖాతా తెరిస్తే అనేక ప్రోత్సాహకాలు అందించనున్నట్లు తెలిపింది. ఇందుకు సంబంధించి ఆ శాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించింది. ఈ మేరకు సదరు శాఖ ఉన్నతాధికారులు జిల్లాలోని ఉద్యోగులకు లేఖ పంపించారు. యూనియన్ బ్యాంకులో ఖాతా తెరిచి వారు అందించే ప్రోత్సాహకాలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ బ్యాంకులో ఖాతా తెరిస్తే ఉద్యోగులకు ప్రమాదబీమా, గ్రూప్ బీమా, మెడిక్లెయిమ్, టెంపరరి ఓడీ, హోంలోన్స్‌లో మినహాయింపులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖలోని ఉద్యోగులతో పాటు ఆశాలు, నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఎన్‌హెచ్‌ఎం మిషన్ డైరెక్టర్ సూచించారు.

మద్యం అక్రమ నిల్వలపై నిఘా పెంచాలి


బనగానపల్లెలో రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ కమీషనర్ టి విజయశేఖర్

కోవెలకుంట్ల: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం నిల్వలపై నిఘా పెంచాలని అనంతపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిప్యూటీ కమీషనర్ టి. విజయశేఖర్ సూచించారు. బుధవారం స్థానిక సెబ్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను పాటిస్తూ అక్రమ మద్యం తరలింపు, మద్యం నిల్వలపై ఎప్పటికప్పుడూ తనిఖీలు నిర్వహించాలన్నారు. మద్యం, నాటుసారా కేసుల్లో పట్టుబడిన నిందితులపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సెబ్ సీఐ వర్ధనాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

బనగానపల్లె రూరల్: స్థానిక సెబ్ పోలీసు స్టేషన్‌ను సెబ్ డిప్యూటీ కమిషనర్ టి. విజయశేఖర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో సెబ్ స్టేషన్ పరిధిలో ఇంత వరకు సీజ్ చేసిన మద్యం, వాహనాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారీదారులు పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, అక్రమ మద్యానికి అనువైన మార్గాలను తరచూ తనిఖీ చేయాలని సెబ్ స్టేషన్ సీఐ జోగేంద్ర ఎస్ఐ పోతులయ్యకు ఆదేశించారు.


ఓర్వకల్లు: శకునాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ రోడ్‌షోకు విశేష జనస్పందన, (ఇన్‌సెట్) ప్రచార రథంపై నుంచి ప్రసంగిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

ప్రచార పర్వం: జన దీవెన

మండుటెండల్లోనూ ఎన్నికల ప్రచారాన్ని అభ్యర్థులు హోరెత్తిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు జనం నీరాజనం పలుకుతున్నారు. రోడ్‌షోలకు బ్రహ్మరథం పడుతున్నారు. వైఎస్సార్‌సీ జెండాలు పట్టుకుని కదం తొక్కుతున్నారు. జై జగన్ నినాదాలతో ఉత్సాహాన్ని కనబరుస్తున్నారు. అభ్యర్థులు ఫ్యాన్ గుర్తును చూపుతూ తమను ఆశీర్వదించాలని ఓటర్లను కోరుతున్నారు.

–సాక్షి నెట్‌వర్క్


తుగ్గలి: ఉుబాష్‌పురంలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రచారంలో జనహోరు, (ఇన్‌సెట్) రామలింగాయపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి


బొమ్మలసత్రం: నంద్యాల పట్టణం 15వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి


ఆలూరు రూరల్: పెద్దహోతూరు గ్రామంలో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విరూపాక్షి


కోసిగి: ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన సిద్దప్ప పాలెం ఊరువాకిలి వాసులు


మహానంది: బండి ఆత్మకూరు మండలం రామాపురంలో మాట్లాడుతున్న శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి


ఆదోనిటౌన్: గణేష్ సర్కిల్ ప్రాంతంలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి


బనగానపల్లె: పసుపలలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి రోడ్డు షోకు భారీగా తరలివచ్చిన ప్రజలు


ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక



రుద్రవరం: కోటకొండలో గంగులకు ఘన స్వాగతం పలుకుతున్న ప్రజలు, కె. కొత్తూరు రోడ్‌షోలో మట్లాడుతున్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

రైతు ద్రోహి చంద్రబాబు

- హిందూపురం ఎంపీ, కర్నూలు పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడు గోరంట్ల మాధవ్

ఆలూరు రూరల్: టీడీపీ అధినేత చంద్రబాబు నాయు డు తన పాలనా కాలంలో హామీలు అమలు చేయకుండా రైతు ద్రోహిగా మిగిలిపోయారని హిందూపురం ఎంపీ, వైఎస్సార్‌సీపీ కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు గోరంట్ల మాధవ్ అన్నారు. వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి ఎన్నికల ప్రచారంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. పెద్దహోతూరులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ చేస్తానని రైతులకు నమ్మించి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా మోసం చేశారన్నారు. చంద్రబాబు కరువుకు కేరాఫ్‌గా మారారని, ఆయన అధికారంలోకి వస్తే వర్షాలు పడవని, పంటలు పండవని ప్రజలు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నదాతల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ ఊరూరా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. సీజన్‌కంటే ముందే రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నారన్నారు. వ్యవసాయానికి పగటి పూట 9 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్నారన్నారు. ఉచిత పంటల బీమా అందిస్తూ రైతుల్లో ధీమా నింపుతున్నారని పేర్కొన్నారు. మహిళా సంక్షేమానికి అనే పథకాలు అమలు చేశారన్నారు. మే 13న జరిగే పోలింగ్ రోజున ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి, కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.


పెద్దహోతూరులో మాట్లాడుతున్న గోరంట్ల మాధవ్

బీ(చ్రు)గా వచ్చి.. తు(ర్రు)మన్నాడు!

డోన్: రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ ప్రధాన కార్యదర్శి అని చెప్పుకుంటున్న బిర్రు ప్రతాప్‌రెడ్డి డోన్ పట్టణంలో బుధవారం సర్పంచుల సమస్యలపై చేపడతానన్న ఆందోళనకు సర్పంచులు ఎవరూ రాకపోవడంతో నీరుగారిపోయింది. స్థానిక టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మద్దతుదారుల డైరెక్షన్‌లో బిర్రు పోలీసు స్టేషన్ ఎదుట కేవలం పాత్రికేయుల సమావేశమంటూ ఐదు నిమిషాలు మాట్లాడి వెళ్లిపోవడంతో ఇదేమి ఆందోళన అని స్థానికులు నవ్వుకున్నారు. సర్పంచుల నిధులు దారి మళ్లింపుపై ఆర్థిక మంత్రిని బదనాం చేయాలనే ఉద్దేశంతో టీడీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి మాటున ఏదో చేయాలనుకున్నారు. ఈయన ఆందోళనలో జిల్లాలో ఏ ఒక్క సర్పంచ్ కూడా పాల్గొనకపోవడంతో స్థానిక టీడీపీ నాయకులు కంగుతిన్నారు. ఆర్థిక మంత్రి బుగ్గన ఢిల్లీ పర్యటనకు వెళ్లారని తెలిసిన తర్వాతే టీడీపీ నాయకులు బిర్రు పర్యటనకు సకల ఏర్పాట్లు చేసి నవ్వుల పాలయ్యారు. చివరకు చేసేదేమిలేక బిర్రు ప్రతాప్‌రెడ్డి టీడీపీ నాయకుల సూచనతో సీఐ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు.


సీఐకి వినతిపత్రం ఇస్తున్న బిర్రు ప్రతాప్‌రెడ్డి

పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డు దొంగతనం

- రూ.5,63,605 విలువైన సొత్తు చోరీ
- కేసు నమోదు చేసిన పోలీసులు


దొంగతనానికి పాల్పడిన హోంగార్డు మనోజ్‌కుమార్

ఆదోని అర్బన్: ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టుకోలేడన్న సామెత మనకు గుర్తుండే ఉంటుంది. పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించే ఓ హోంగార్డు వివిధ కేసుల్లో పట్టుబడిన నగదును తన తెలివితేటలతో దొంగలించి పోలీసులకు చిక్కకుండా తప్పించుకుని తిరిగేవాడు. ఈ విషయంపై పోలీసు అధికారుల దృష్టికి వెళ్లడంతో విచారణ చేపట్టగా, హోంగార్డు ముసుగులో ఉంటూ దొంగతనానికి పాల్పడిన విషయం బయటపడింది. ఎట్టకేలకు ఆ హోంగార్డును పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి, ట్రైనీ డీఎస్పీ ధీరజ్, సీఐ గోపీ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వివరాలు వెల్లడించారు. ఆదోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న కె.మనోజ్ కుమార్ అలియాస్ మనోజ్ పట్టణంలోని కార్వన్ పేటలో నివాసం ఉంటున్నాడు. స్టేషన్ ప్రాపర్టీ రూమ్ తాళాలను దొంగిలించి వాటి ద్వారా మారు(డూప్లికేట్ తాళాలు) తాళాలను తయారు చేయించుకున్నాడు. వాటిని ఉపయోగించి స్టేషన్‌లో ఉన్న సిబ్బందిని మభ్యపెట్టి ఎవరికి తెలియకుండా ప్రాపర్టీ రూమును ఓపెన్ చేసి లోపల ఉన్న బీరువా తాళాలు తెరిచి అందులో ఉన్న వివిధ కేసుల్లో సీజ్ చేసిన నగదును విడతలవారీగా దొంగిలించాడు. దొంగలించిన సొత్తు విలువ రూ.5,63,605గా ఉందని గుర్తించి, కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. పట్టణంలోని రైల్వేగేట్ వద్ద మనోజ్‌కుమార్‌ని అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాన్ని ఒప్పుకున్నాడని చెప్పారు. అతని నుంచి దొంగిలించిన మొత్తంలో రూ.3,00,050 స్వాధీనం చేసుకున్నామన్నారు. మిగిలిన సొమ్మును అతడు తన పెద్ద అన్న కళ్యాణ్‌కు ఇచ్చినట్లు నేరం అంగీకరించాడన్నారు. మనోజ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ప్రాణ హాని ఉంది... రక్షణ కల్పించండి

- పోలీసులను ఆశ్రయించిన మహిళ

కర్నూలు : ఎస్‌సీఎల్‌పీ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న బోయ శంకర్ నుంచి తనకు ప్రాణ హాని ఉందని అదే కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్న పేరపోగు దేవమణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమె భర్త 20 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. 2004 నుంచి ఈమె ఎస్‌సీఎల్‌పీ కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేస్తోంది. అదే కార్యాలయంలో అటెండర్‌గా ఉన్న బోయ శంకర్ మాయమాటలతో ఆమెను పెళ్లి చేసుకుంటానని చెప్పి అవసరాలకు డబ్బు, బంగారు నగలు తీసుకున్నాడు. ఇప్పుడు అవి తిరిగి ఇవ్వకపోగా చంపేస్తానని బెదిరిస్తున్నాడని ఆమె బుధవారం ఫిర్యాదు చేసినట్లు సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

వైఎస్సార్‌సీపీతోనే నాయీ బ్రాహ్మణులకు న్యాయం


'జగనన్నకు తోడుగా మేమంతా సిద్ధం' కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిషోర్‌రెడ్డి, నాయీబ్రాహ్మణుల సంఘం నాయకులు

- 1,150 దేవాలయాల్లో పాలక వర్గ సభ్యులుగా అవకాశం
- టీటీడీ బోర్డు మెంబర్ సిద్దవటం యానాదయ్య

బొమ్మలసత్రం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాయీ బ్రాహ్మణులకు న్యాయం జరిగిందని టీటీడీ బోర్డు మెంబర్, నాయీబ్రాహ్మణుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిద్దవటం యానాదయ్య అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో నాయీ బ్రాహ్మణులు న్యాయమైన కోరికలు అడిగితే మీ తోకలు కత్తరిస్తా...అంటూ నిప్పులు చెరిగిన చంద్రబాబుకు ఈఎన్నికల్లో తగిన బుద్ధిచెబుతామన్నారు. నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి చేతుల మీదుగా బుధవారం నాయీబ్రాహ్మణుల సంఘం నాయకులు 'జగనన్నకు తోడుగా మేమంతా సిద్ధం' కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదులుగా హాజరైన టీటీడీ బోర్డు మెంబర్ యానదయ్యా మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వంలో బీసీలకు కులవృత్తికి సంబంధించిన వస్తువులు మాత్రమే పంపిణీ చేస్తూ బీసీలను అణగదొక్కాడని, కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీలకు నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించి రాజకీయంగా ప్రోత్సహించారన్నారు. భారతదేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా టీటీడీతో సహా రూ. 5 లక్షలు ఆదాయం దాటిన అన్ని దేవాలయాల్లో నాయీ బ్రాహ్మణులకు పాలకమండలి సభ్యులుగా అవకాశం కల్పించారు. చంద్రబాబు ఇదే సమస్యలపై అడిగితే మిమ్మల్ని గుళ్లలో అడుగు పెట్టనివ్వనూ... మీ తోకలు కత్తరిస్తానని అవమానించాడన్నారు. అదే నాయీ బ్రాహ్మణులను రాష్ట్రంలోని 1,150 దేవాలయాల్లో పాలకమండలి సభ్యులుగా ఉన్నత స్థానంలో కూర్చోబెట్టారు. ఆలయాల్లో క్షవరం వృత్తి చేసుకునే వారికి ఉద్యోగ భద్రత కల్పించి వారికి కనీస వేతనం రూ. 20 వేలు ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలో 50 వేల క్షవరం షాపుల యజమానులకు ఏడాదికి రూ. 50 కోట్లు చేదోడు పథకం అందిస్తూ 150 యూనిట్లు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నారు. ఈ ఎన్నికల్లో నాయీ బ్రాహ్మణులు వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కోశాధికారి ధనంజేయుడు,పట్టణఅధ్యక్షులు రాంపుల్లయ్య, మాజీ కౌన్సిలర్ సుబ్బరాయుడు, లోకేష్, విజయభాస్కర వెంకటరమణ, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు వైఎస్సార్‌సీపీలో చేరిక


మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన భారతిరెడ్డి, టీడీపీ శ్రేణులు

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా టీడీపీ మహిళా ఉపాధ్యక్షురాలు భారతిరెడ్డి బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక శిల్పా నివాసంలో మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి ఆమెకు పార్టీ కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. పట్టణంలోని 24వ వార్డుకు చెందిన 50 కుటుంబాలు వార్డు ఇన్చార్జ్ షేక్ రహంతుల్లా ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా భారతిరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు తనను పార్టీలోకి ఆకర్షించాయన్నారు. పేదల ఆర్థికంగా ఎదిగేందుకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి ఆదుకున్నారని వివరించారు. చంద్రబాబు అబద్ధాల హామీలను ప్రజలు నమ్మవద్దని హితవు పలికారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తిరిగి వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావాలన్నారు. రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల వారిని రాజకీయంగా ఎదిగేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించారు. ప్రజలు వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులు చిరంజీవి, ఓబులేసు, హుస్సేన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు: నగర శివారులోని మారుతినగర్‌లో నివాసముంటున్న గంగా సంతోష్ (34) బెడ్‌రూమ్‌లో ఫ్యాన్ కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయనకు 12 ఏళ్ల క్రితం ఆనందమ్మతో వివాహమైంది. ఏడాదికే మనస్పర్థలు ఏర్పడి భార్యాభర్తలు విడిపోయారు. అప్పటినుంచి సంతోష్ మద్యానికి బానిసయ్యాడు.రెండు రోజుల క్రితం మంగళవారం మధ్యాహ్నం సంతోష్ ఇంట్లోనే మద్యం సేవిస్తూ తనకు రెండో వివాహం చేయాలని తల్లితో గొడవ పడ్డాడు. మాటామాటా పెరిగి క్షణికావేశంలో బెడ్‌రూమ్‌లోకి వెళ్లి చున్నీతో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. వెంటనే ఉరి నుంచి తప్పించి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా చికిత్సపొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. బుధవారం తల్లి ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

చెక్ పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండండి

- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు



రికార్డులను తనిఖీ చేస్తున్న కలెక్టర్

నంద్యాల(అర్బన్): జిల్లా సరిహద్దు చెక్ పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉంటూ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం పట్టణ శివారు ప్రాంతాల్లోని అయ్యలూరి మెట్ట, గాజులపల్లి మెట్ట క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను కలెక్టర్ తనిఖీ చేశారు. వాహనాలను నమోదు చేసిన రిజిస్టర్‌ను పరిశీలించారు. తనిఖీల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు, అక్రమ నగదు, మద్యం రవాణాను అరికట్టాలని సూచించారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి నగదు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకొని వెళ్తున్నట్లు సమాచారం ఉంటే సంబంధిత అధికారులు, పోలీస్ స్టేషన్ వారికి సమాచారం అందించాలన్నారు.

కురువ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



మాట్లాడుతున్న కురువ సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ ఏడాది 10వ తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన కురువ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు ఆ సంఘం నేతలు తెలిపారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు కె. క్రిష్టన్న, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, ఎంకే రంగస్వామి మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులు తమ మార్కుల జాబితాలను ఈ నెల 10వ తేదీలోగా సెల్ : 9032741194, 9440756199 నంబర్లకు వాట్సాప్ పంపాలని కోరారు. ఈ సమావేశంలో నేతలు గుడిసె శివన్న, బి. వెంకటేశ్వర్లు, కత్తి శంకర్, ఉరుకుందు, దేవేంద్ర, కేసీ నాగన్న, తవుడు శ్రీనివాసులు, బీసీ తిరుపాలు, ధనుంజయ, హరిదాసు, పుల్లన్న, నాగయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి



మందుల వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. బుధవారం స్థానిక మెరీడియన్ ఫంక్షన్ హాల్ యూపీహెచ్‌సీ పరిధిలోని హబీబ్ ముబారక్ నగర్‌లో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. అక్కడి ల్యాబ్, ఫార్మసీ, రికార్డులు, వ్యాక్సిన్ నిల్వ ఉండే శీతలీకరణ పరికరాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీకాకు అర్హులైన గర్భిణులు, పిల్లల వివరాలను పరిశీలించి టీకాల వివరాలన్నీ యూ విన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. గర్భిణుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఐదేళ్లలోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పకుండా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మాధవి, డీపీఎం ప్రసాద్, ప్రాజెక్ట్ నిస్సు ఖలీల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహానంది గోశాల వద్ద చిరుత సంచారం



చిరుత పాదముద్ర

మహానంది: మహానందిలోని గోశాల సమీపంలో బుధవారం తెల్లవారుజామున చిరుత కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. విధుల్లో భాగంగా ఆలయ ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, ఆవుల కాపరులు, సిబ్బంది వేకువజామున వెళ్లగా గోశాల ఎదురుగా ఉన్న శ్మశాన వాటిక మూలన చిరుత కూర్చున్నట్లు గుర్తించారు. దీంతో స్థానికులు వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న డీఆర్‌ఓ హైమావతి, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పాదముద్రలు గుర్తించినట్లు అటవీశాఖ డీఆర్‌ఓ హైమావతి తెలిపారు. ఇదిలా ఉండగా గోశాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని దేవస్థానం ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు.

తెలుగు తమ్ముళ్ల వీరంగం

- పెద్దపాదిళ్లలో కోట్ల సమక్షంలోనే టీడీపీ వర్గీయుల ఘర్షణ
- ఎస్సీలు, బీసీలు ప్రచార రథం ఎక్కకూడదని ఆక్షేపించిన ఓ వర్గం
- కోట్లకు గజమాల వేసే విషయంలో ఘర్షణ
- ప్రచారం చేయకుండానే వెనుదిరిగిన కోట్ల



కొట్టుకుంటున్న తెలుగు తమ్ముళ్లు

ప్యాపిలి: ఐదేళ్ల పాటు ప్రశాంతంగా ఉన్న డోన్ నియోజకవర్గం కోట్ల, కేఈ వర్గీయుల ఘర్షణలతో అట్టుడికే పరిస్థితికి చేరుకుంది. ఎన్నికలు సమీపించే కొద్దీ కోట్ల, కేఈ వర్గాల ఆగడాలు శ్రుతిమీరుతున్నాయి. టీడీపీలో అంతర్గత విభేదాలు రచ్చకెక్కి చిలికి చిలికి గాలివానలా మారుతున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందో గ్రామీణప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని పెద్దపాదిళ్ల గ్రామంలో బుధవారం జరిగిన ఘర్షణే ఇందుకు నిదర్శనం. టీడీపీ అభ్యర్థి కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామానికి చేరుకున్నారు. అప్పటికే గ్రామానికి చెందిన ప్రసాద్‌రెడ్డి వర్గీయులు, తలారి శ్రీరాములు వర్గీయులు విడివిడిగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. గ్రామానికి చేరుకున్న కోట్ల ప్రచార రథంపైకి ఎక్కారు. అప్పటికే ఇరు వర్గాల నాయకులు ప్రచార రథంపై ఉన్నారు. తలారి శ్రీరాములు వర్గానికి చెందిన మహేశ్‌తో పాటు దళితుడు ఓబులేసు.. సూర్యప్రకాశ్ రెడ్డికి గజమాల వేస్తుండగా ప్రసాద్‌రెడ్డి వర్గీయులు అడ్డుకున్నారు. 'ఎస్సీ కులానికి చెందిన నీవు ప్రచార రథంపైకి ఎక్కడమే కాకుండా గజమాల వేస్తావా?' అంటూ ప్రసాద్‌రెడ్డి వర్గీయులు అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహించిన శ్రీరాములు వర్గీయులు ప్రసాద్‌రెడ్డి వర్గీయులపై దాడి చేశారు. తర్వాత ఇరువర్గాలు ప్రచార రథంపైనే ఘర్షణకు దిగారు. మరో వైపు ప్రచార రథం ర్యాలీలో ఉన్న తెలుగు తమ్ముళ్లు కూడా పరస్పరం రాళ్లు, కర్రలతో దాడులు చేసుకున్నారు. దాడిలో ప్రసాద్‌రెడ్డి వర్గీయుడైన సత్యంరెడ్డి, చరణ్‌లు గాయపడ్డారు. దీంతో హతాశులైన కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి 'కార్యక్రమం మీరే చేసుకోండి' అంటూ అసహనం వ్యక్తం చేస్తూ ప్రచారం చేయకుండానే ప్రచార రథం దిగి తన వాహనంలో డోన్‌కు వెనుతిరిగారు.



గాయపడిన సత్యం రెడ్డి

నివురుగప్పిన నిప్పులా పెద్దపాదిళ్ల ..

గత నెల 27వ తేదీన ప్యాపిలిలో టీడీపీ కార్యాలయంలో పెద్దపాదిళ్ల బూత్ ఇన్‌చార్జ్ విషయంలో జరిగిన ఘర్షణలో ధర్మారం సుబ్బారెడ్డి సోదరుడు చిన్ననాగిరెడ్డి గాయపడ్డాడు. ఈ సంఘటన మరువక ముందే పెద్దపాదిళ్ల గ్రామంలోనే మరోసారి ఘర్షణ జరగడంతో గ్రామం నివురుగప్పిన నిప్పులా ఉంది. బుధవారం వందల సంఖ్యలో గుమిగూడిన తెలుగు తమ్ముళ్లు పరస్పరం రాళ్లు, కర్రలతో కొట్టుకోవడంతో ఆ ప్రాంతం రణరంగాన్ని తలపించింది. కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి వెళ్లిపోయిన తర్వాత కూడా ఇరు వర్గాల వారు గ్రామంలో పట్టుడు కర్రలతో హల్‌చల్ చేశారు. ఒక దశలో ఓ వ్యక్తి వేటకొడవలి తీసుకుని రావడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. ప్యాపిలి సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్‌ఐ జగదీశ్వర్ రెడ్డి తమ సిబ్బందితో గ్రామానికి చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు.



తన వాహనం ఎక్కి వెనుతిరిగిన కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి



పరిస్థితిని సమీక్షిస్తున్న సీఐ, ఎస్సై

కేఈ వర్గీయుల్లో తీవ్ర అసహనం..

డోన్ పట్టణంలో సోమవారం జరిగిన టీడీపీ ప్రచార కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదే పదే టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి పేరుతో పాటు ధర్మారం సుబ్బారెడ్డి పేరును ప్రస్తావించారు. సుబ్బారెడ్డి వర్గీయులు కోట్లకు ఓటు వేయాలని చంద్రబాబు నాయుడు కోరారు. అంతే కాకుండా ఎన్నికల్లో కోట్ల గెలిచినా సుబ్బారెడ్డి ఎమ్మెల్యే అయినట్లే అని చంద్రబాబు చెప్పారు. చంద్రబాబు నాయుడు తన ప్రసంగంలో కేఈ కుటుంబం ప్రస్తావనే చేయకపోవడంతో కేఈ వర్గీయులు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో వారిలో అసహనం పెరిగిపోయింది. పెద్దపాదిళ్లలో ప్రచార రథంపైకి ఎక్కిన కేఈ వర్గీయులను అడ్డుకోవడంతో పరస్పర దాడులు జరిగాయి.

చెక్ పోస్టులలో పటిష్ట నిఘా



రాయల్టీ చెక్ పోస్టు వద్ద తనిఖీలు పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అబ్జర్వర్

కొలిమిగుండ్ల: ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చెక్‌పోస్టులలో పటిష్ట నిఘా ఉండాలని జిల్లా ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ హిమాన్షు శంకర్ త్రివేది అన్నారు. బుధవారం కొలిమిగుండ్ల మండలంలో సమస్యాత్మక గ్రామాలైన గొర్విమానుపల్లె, అంకిరెడ్డిపల్లె, చింతలాయిపల్లె, నాయినపల్లె, పెట్నికోట గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఆయా గ్రామాల ప్రజలతో సమావేశమై సీ-విజిల్ యాప్‌పై అవగాహన కల్పించారు. ఎన్నికల సందర్భంగా ఏవైనా సమస్యలు ఎదురైతే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. బందార్లపల్లె క్రాస్ రోడ్డు సమీపంలోని రాయల్టీ చెక్ పోస్టు వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును తనిఖీ చేశారు. రాక పోకలు సాగించే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో సిబ్బంది అప్రమత్తంగా ఉండి తనిఖీలు పకడ్బందీగా చేయాలని సూచించారు. ఆయన వెంట కొలిమిగుండ్ల సీఐ గోపీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.9.60 లక్షలు జరిమానా

కర్నూలు (న్యూటౌన్): అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న మూడు లారీల నుంచి రూ.9.60లక్షలు అపరాధ రుసుం వసూలు చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి. రాజశేఖర్ తెలిపారు. ఒంగోలు జిల్లా బుదవాడ నుంచి అక్రమంగా గ్రానైట్ స్లాబ్స్ రవాణా చేస్తున్న కేసులో మూడు లారీలను సీజ్ చేశారు. ఒక్కో లారీ యజమాని నుంచి రూ.3.2 లక్షల చొప్పున మొత్తం రూ.9.60 లక్షలు అపరాధ రుసుం వసూలు చేశారు. తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టల్ శాఖ సిబ్బంది

నంద్యాల(వ్యవసాయం): పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోస్టల్ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

వడదెబ్బతో యువతి మృతి



సంధ్య (ఫైల్)

వాగలమర్రి: మండలంలోని పెద్ద బోధనం గ్రామానికి చెందిన యువతి సంధ్య(22) వడదెబ్బకు గురై మృతి చెందింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం పెద్ద బోధనం గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన రాజా, శివమ్మ దంపతుల కుమార్తె డొంక సంధ్య (22) బుధవారం వడదెబ్బ బారిన పడి అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అయితే అప్పటికే ఆమె పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు.

మోసం చేయడంలో బాబు దిట్ట

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ వెల్లడి




సమావేశంలో మాట్లాడుతున్న, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్

కర్నూలు (టౌన్) : మాయమాటలతో మోసం చేయడంలో, ఆచరణ సాధ్యం కాని హామీలు ఇవ్వడంలో టీడీపీ అధినేత చంద్రబాబు దిట్ట అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ విమర్శించారు. బుధవారం సాయంత్రం స్థానిక సి.క్యాంపు సెంటర్‌లోని కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. చంద్రబాబు ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోను ప్రజలే కాదు.. కూటమిలోని భాగస్వామి బీజేపీ కూడా నమ్మడం లేదన్నారు. బీజేపీ నేత సిద్ధార్థ్ నాథ్ సింగ్ మేనిఫెస్టో కాపీని సైతం పట్టుకునేందుకు ఇష్టపడలేదన్నారు. అధికారం కోసం రాష్ట్రంలోని మహిళలు, రైతులు, యువకులు, నిరుద్యోగులు, వృద్ధులు ఇలా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసేందుకు అమలుకు వీలుకాని హామీలు ఇస్తున్నారన్నారు. బాబు మేనిఫెస్టో అమలు చేయాలంటే ప్రతి సంవత్సరం రూ.1.50 లక్షలు కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. ఇది సాధ్యమా అని ప్రశ్నించారు. చెప్పిందంటే చెస్తాడనే నమ్మకం జగన్‌మోహన్‌రెడ్డిపై ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ అమలు చేయగలిగే హామీలనే ఇస్తుందన్నారు. కరోనా సమయంలోనూ రాష్ట్ర ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌ది అన్నారు. అందుకే బడుగు, బలహీన వర్గాలు, ఉన్నత వర్గాల్లో పేదలు, మహిళలు జగనన్న వెంటే ఉన్నారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా కార్యదర్శి కె. నాగేశ్వరి, మహిళా విభాగం నాయకులు చంద్రకళ, ముప్పారి గాలి రాజు, పవన్ పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో శిశువు అపహరణకు యత్నం

- మహిళను పట్టుకున్న సెక్యూరిటీ సిబ్బంది
- మూడో పట్టణ పోలీసులకు అప్పగింత



శిశువుతో బస్తిపాడు గ్రామానికి చెందిన బాలింత జ్యోతి

కర్నూలు (టౌన్) : పెద్దాసుపత్రిలో మూడు రోజుల పసికందును అపహరించేందుకు యత్నించిన ఓ మహిళను ఆసుపత్రి సెక్యూరిటీ విభాగం గుర్తించి పట్టుకున్నారు. బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆసుపత్రిలోని కాన్పుల వార్డులో కల్లూరు మండలం బస్తిపాడుకు చెందిన జ్యోతి అనే మహిళ మూడు రోజుల క్రితం మగ శిశువుకు జన్మనిచ్చింది. కర్నూలు నగరంలోని వన్‌టౌన్ ఏరియాకు చెందిన ప్రమీల అనే మహిళ మరో మహిళతో కలసి శిశువు తల్లి వద్దకు వచ్చింది. మాటలు కలిపి శిశువును చూస్తామని చెప్పారు. కొద్దిసేపటికే తల్లికి తెలియకుండా ఆ శిశువును తీసుకొని ఇరువురు అక్కడి నుంచి ఉడాయించారు. కాన్పుల వార్డు నుంచి హడావుడిగా బయటకు వస్తున్న ఈ ఇద్దరు మహిళలను సెక్యూరిటీ సిబ్బంది నిలిపి వివరాలు అడిగారు. సరిగా సమాధానం చెప్పకపోవడంతో అనుమానం వచ్చింది. ఈ క్రమంలో గుర్తు తెలియని మహిళ అక్కడి నుంచి పారిపోగా పట్టుబడిన ప్రమీలను ఆసుపత్రి అధికారులకు అప్పగించారు. తర్వాత కర్నూలు మూడవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు బాధితురాలి ఫిర్యాదు మేరకు ప్రాథమిక విచారణ జరిపి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

న్యాయ సేవా సదన్‌లో మే డే ఉత్సవాలు

కర్నూలు (లీగల్): ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా న్యాయ సేవా సదన్‌లో మేడే ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి మాట్లాడుతూ వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం నల్సా (అసంఘటిత రంగంలో కార్మికులకు న్యాయ సేవలు) పథకం-2015, రాజ్యాంగం కల్పించిన చట్టాలను గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దుకాణ కార్మికులు, ఆటో, హమాలీ, బిల్డింగ్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని, చూపుతున్న సెబ్ పోలీసులు

ఆలూరు: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా వివిధ గ్రామాలకు సరఫరా చేస్తున్న రూ 3.62 లక్షల విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా సెబ్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఆస్పరి మండలంలోని తొగరగల్లు బండి రస్తాలో సెబ్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఈ. నరసానాయుడు సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తుండగా మహేంద్ర స్కార్పియో వాహనంలో 60 బాక్సుల (5.760 టెట్రా ప్యాకెట్లు) కర్ణాటక మద్యాన్ని గుర్తించారు. పట్టుబడిన మద్యం విలువ రూ 3.62 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ మద్యాన్ని తరలిస్తున్న చిప్పగిరి మండలం రామదుర్గం గ్రామానికి చెందిన పాలి వీర శ్రీకాంత్‌రెడ్డి, అదే గ్రామానికి చెందిన జిట్టకంటి నరసింహులు, కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా జాలహళ్ళి గ్రామానికి చెందిన జి. రాజశేఖర్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఆస్పరి మండలం యాటకల్లు గ్రామానికి చెందిన బోయ సుంకన్న కుమారుడు బోయ రామాంజనేయులు పోలీసుల నుంచి తప్పించుకుని పారిపోయారన్నారు. ఈ కేసులో మరో ఆరుగురి కోసం ప్రత్యేకం బృందాలతో గాలిస్తున్నామన్నారు. తనిఖీల్లో ఆలూరు సెబ్ సీఐ డి. సోమశేఖర్, హెడ్ కానిస్టేబుల్ వెంకటరాముడు, సిబ్బంది రాముడు, శ్రీనివాసులు, మహేశ్వరరెడ్డి, విజయ్, నాగరాజ్, విజయుడు, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో పదేళ్ల జైలు శిక్ష



హత్యాయత్నం కేసులో శిక్షకు గురైన బలిజ రాజా

కర్నూలు (లీగల్) : కట్టుకున్న భార్యపై అనుమానంతో హత్య చేయబోయిన భర్తకు కర్నూలు అదనపు అసిస్టెంట్ సెషన్స్ కోర్టు పదేళ్ల జైలు శిక్ష, రూ.30 వేలు జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పింది. కేసు వివరాల్లోకి వెళ్తే.. నంద్యాలకు చెందిన షేక్ షహజీల్ మొదటి భర్తతో మనస్పర్థలు రావడంతో విడిపోయింది. తర్వాత వెలుగోడుకు చెందిన రాజుతో ఆమెకు రెండో వివాహమైంది. కొన్నాళ్లకు భార్యపై అనుమానంతో అతను వేధించేవాడు. 2017 సెప్టెంబర్ 4వ తేదీన భార్యను ఓర్వకల్లు సమీపంలోని రాక్ గార్డెన్‌కు తీసుకెళ్లాడు. అక్కడ గది అద్దెకు తీసుకుని ఒక్క రోజంతా ఉన్నారు. మరుసటి రోజు పథకం ప్రకారం ఆమెపై కత్తితో గొంతు కోసేందుకు యత్నించాడు.గట్టిగా కేకలు వేయడంతో తలపై మద్యం బాటిల్‌తో కొట్టాడు. తర్వాత స్పృహ కోల్పోయి పడిపోయిన షహజీల్‌ను వదిలేసి వెళ్లాడు. సమాచారం అందుకున్న ఓర్వకల్లు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆమెను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పి.దివాకర్ నిందితుడికి జైలు శిక్ష, రూ. 30 వేలు జరిమానా విధించారు. బాధితురాలికి రూ.3 లక్షలు ప్రభుత్వ సహాయం అందించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ జి.బాలరంగస్వామి వాదించారు.

మద్యం తయారీ కేంద్రమే.. కూటమి కార్యాలయం

- కార్యాలయాన్ని ప్రారంభించిన కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి



ఒకప్పటి నకిలీ మద్యం తయారీ డెన్.. నేడు జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి కార్యాలయం

డోన్: హంతకులు ఎవరో.. ప్రజాసేవకులెవరో తెలుసుకోవాల్సిన కనీస స్పృహ టీడీపీ నాయకులకు లేకుండా పోయింది. ఏడేళ్ల క్రితం సంచలనం సృష్టించిన మండలంలోని ఉడుములపాడు గ్రామంలో నకిలీ మద్యం తయారీ కేసును అప్పట్లో ఎక్సైజ్, సివిల్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో అప్పటి డోన్ టీడీపీ ఇన్‌చార్జ్ కేఈ ప్రతాప్ ప్రధాన నిందితుడిగా ఉన్నారు. ఈ నకిలీ మద్యం తయారీకి సూత్రధారుడు ఉడుములపాడు ఉప్పరి రాంబాబు. అతడు ఇప్పుడు తెలుగుదేశం పార్టీ మునుగు తొలగించి జనసేన కండువా కప్పుకున్నారు. అప్పుడు గ్రామంలో నకిలీ మద్యం తయారీ కేంద్రంగా ఉండి, పెద్ద మొత్తంలో లేబుళ్లు, మూతలు, సీసాలు, నకిలీ మద్యం పట్టుబడిన భవనాన్ని రాంబాబు జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి కార్యాలయంగా మార్చారు. ఈ కార్యాలన్ని కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ప్రారంభించడం చర్చనీయాంశమైంది. నకిలీ మద్యం తయారీ ద్వారా రాష్ట్రంలో అనేక మంది ప్రాణాలను బలిగొన్న కేసులో నిందితులైన వారిని వెంటబెట్టుకోవడం, వారు నిర్వహించే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం టీడీపీ అభ్యర్థికి తగదని నియోజకవర్గ ప్రజలు ఆక్షేపిస్తున్నారు. ఇప్పుడే ఇలాంటి వారిని నెత్తిన పెట్టుకొని ఊరేగుతున్న టీడీపీ నాయకులు ఒకవేళ అధికారం వస్తే ప్రజల ధన, మాన ప్రాణాలకు రక్షణ ఉండదని భీతిల్లుతున్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కోట్ల



టీడీపీ అభ్యర్థి కోట్లకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉప్పరి రాంబాబు



ఎక్సైజ్, సివిల్ పోలీసులు గుర్తించిన నకిలీ మద్యం తయారీకి ఉపయోగించే స్పిరిట్ నిల్వలు (ఫైల్)



ఇంపీరియల్ బ్లూ పేరుతో నకిలీ మద్యాన్ని తయారు చేసిన దృశ్యం (ఫైల్)

లెక్కలు చూపకపోతే చిక్కులే

గత శాసనసభ ఎన్నికల సమయంలో ఆదోని ప్రాంతానికి చెందిన ఓ వస్త్ర దుకాణానికి చెందిన నగదును సమీపంలోని బ్యాంకులో జమ చేసేందుకు వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. సంబంధిత పత్రాలు చూపించినప్పటికీ ఏదైనా ఉంటే ఎన్నికల అధికారులకు చెప్పుకోవాలంటూ డబ్బు సీజ్ చేశారు. ఎన్నికల కోడ్ ముగిసేవరకు వ్యాపారులు ఆ మొత్తాన్ని పొందలేకపోయారు.

కర్నూలు నగరంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి ఓ స్థిరాస్తి వ్యాపారి ద్విచక్ర వాహనంపై రూ.3 లక్షలు నగదు తీసుకెళ్తుండగా పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు. సరైన ఆధారాలు లేకపోవడంతో సొమ్ము సీజ్ చేశారు. తర్వాత విడిపించుకునేందుకు నానా అవస్థలు పడాల్సి వచ్చింది.



గాజులపల్లె చెక్‌పోస్ట్ వద్ద పోలీసులకు పట్టుబడిన నగదు(ఫైల్)

- ఎన్నికల వేళ నగదు తరలింపులో జాగ్రత్తలు అవసరం
- రూ.50 వేలకు పైగా నగదు తీసుకెళ్తుంటే ఆధారాలు తప్పనిసరి
- ఎన్నికల కోడ్‌తో వివిధ అవసరాలకు సామాన్యుల ఇబ్బందులు

కర్నూలు : ఎన్నికల కోడ్ అమలు సామాన్య, మధ్య తరగతి ప్రజలను ఇరకాటంలో పడేస్తోంది. చేతిలో రూ.50 వేలకు పైగా నగదు పట్టుకుని బయటకు వెళ్లాలంటేనే జనం జంకుతున్నారు. ముఖ్యంగా బ్యాంకులో జమ చేసేందుకు వెళ్లాలన్నా, అక్కడి నుంచి నగదు తీసుకురావాలన్నా బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సి వస్తుంది. దాదాపు ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటినుంచి పోలీసులు చెక్‌పోస్టుల్లో నిఘా వేసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. అడపాదడపా పట్టుబడుతున్న మొత్తం అంతా ఎన్నికలకు సంబంధం లేదని సంబంధిత అధికారులకు తెలిసినప్పటికీ నిబంధనల అమలులో భాగంగా పట్టుకోక తప్పడం లేదు. దీంతో వ్యాపార, ఇతర అవసరాలకు నగదు తీసుకెళ్లే వారికి కష్టాలు తప్పడం లేదు.

చిక్కని రాజకీయ పార్టీల నగదు

జిల్లాలో 13 అంతర్‌రాష్ట్ర జిల్లా సరిహద్దు చెక్‌పోస్టులు ఉన్నాయి. వాటిలో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ ఇప్పటి వరకు రాజకీయ పార్టీలకు సంబంధించిన నగదు పెద్ద మొత్తంలో పట్టుకున్న దాఖలాలు లేవు. అడపాదడపా పట్టుబడిన నగదు, చిరు వ్యాపారులు, రైతులు, సామాన్యులకు సంబంధించిన నగదు కావడం గమనార్హం. రాజకీయ పార్టీల నాయకులు రూ.50 వేలకు మించి నగదు, రూ.10 వేల విలువ కన్నా ఎక్కువగా సామగ్రి రవాణా చేయడం నిషిద్ధం. ప్రచార కార్యక్రమాల సమయంలో కూడా రూ.లక్షకు మించి నగదు ఉండకూడదు.

విడిపించుకునేందుకు తంటాలు...

స్వాధీనం చేసుకున్న నగదును విడిపించుకునేందుకు బాధితులు అనేక తంటాలు పడుతున్నారు. పట్టుబడిన నగదు, నగలను విడిపించుకోవడానికి రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లాలో సుమారు రూ.2.50 కోట్లు నగదు, 66.98 కేజీల వెండి, 4.23 కేజీల బంగారం పట్టుబడింది. వీటి విలువ రూ.3.10 కోట్లు పైబడి ఉంటుంది. వాటిని విడిపించుకోవడానికి రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి వస్తుందని బాధితులు వాపోతున్నారు.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

- ధాన్యం విక్రయించిన రైతులు వ్యాపారుల నుంచి రశీదులు తీసుకోవాలి. తెల్ల కాగితాల మీద రాసిస్తే లెక్కలోకి రావు. తప్పకుండా రశీదు కావాలని అడిగి తీసుకోవాలి.
- బ్యాంకు లేదా ఏటీఎం కార్డు నుంచి రూ.50 వేల కంటే ఎక్కువ విత్‌డ్రా చేస్తే దానికి సంబంధించిన ఏటీఎం స్లిప్‌లు, పాస్ పుస్తకాలు, రశీదులను తప్పనిసరిగా దగ్గర ఉంచుకోవాలి.

నిర్లక్ష్యం వద్దు...

వ్యాపార చెల్లింపులు చేసేవారు తగిన ఆధారాలతోనే నగదు తీసుకెళ్లాలి. రోజువారీగా తీసుకెళ్లే మొత్తమే అయినప్పటికీ సంబంధిత ఆధారాలు వెంట ఉంచుకోవాలి. ఏ అవసరం నిమిత్తం నగదు తీసుకెళ్తున్నామనే విషయం సూటిగా చెప్పడంతో పాటు తగిన పత్రాలు తప్పక చూపాలి. ఏమాత్రం భయపడినా, సరైన సమాధానం చెప్పకపోయినా పోలీసులకు అనుమానం వస్తుందని గుర్తుంచుకోవాలి. ఆసుపత్రిలో చికిత్సకు సంబంధించి బిల్లు చెల్లించడానికి డబ్బు తీసుకెళ్తుంటే రోగి చికిత్సకు సంబంధించిన వివరాలు, ఆసుపత్రి బిల్లు, రశీదులు వెంట ఉంచుకోవాలి.